
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 26 సెప్టెంబరు 2024





నాడు కంపచెట్లతో వున్న రైతుల ప్లాట్లు, పొలాలు




కంపచెట్లు తొలగడంతో కనువిందుగా రైతుల ప్లాట్లు, పొలాలు

- నాటి వైసీపీ పాలనలో చిట్టడవిలా రైతుల ప్లాట్లు
- నేడు అద్దాల్లా చదునుగా దర్శనమిస్తున్న వైనం
- నాడు ఒక వెలుగు వెలిగిన ఆర్- 5 జోన్ ప్లాట్లు
- నేడు కంప చెట్లుతో నిండిపోయిన ఆర్- 5 జోన్
- కోర్టు కేసు నడుస్తుండడంతో ఆ వైపు చూడని సీఆర్డీఏ



కంపచెట్లతో నిండిపోయిన అంతర్గత రహదారి నాడు..



కంపచెట్లు తొలగించిన తరువాత రోడ్లు

సిద్ధమవుతోన్న.. రైతుల ప్లాట్లు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓడలు బళ్లు.. బళ్లు ఓడలు కావడం అంటే ఇదేనేమో.. గత వైసీపీ పాలనలో చిట్టడవిలా మారి, చీకటితో నిండిపోయిన నవ్యాంధ్ర రాజధాని నేడు వెలుగులు చిమ్ముతోంది. నాడు రైతుల గుండెల్లో కుంపట్లు రాజేసిన ఆర్- 5 జోన్ నేడు కంప చెట్లతో అడవిలా మారిపోయింది. సరిగ్గా 15 నెలల్లో ఎంత మార్పు! 'ఇదే నా మాట.. నా మాటే శాసనం అన్నట్లుగా' సాగిన గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి పాలనలో 'తామే శాశ్వతం.. తామన్నదే వేదం.. తాము చెప్పిందే చట్టం' అన్నట్లుగా అమరావతిపై ఇష్టారీతిగా విరుచుకుపడ్డారు. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించి ఆర్- 5 జోన్ పేరుతో రాజధాని రైతుల గుండెలపై చిచ్చు రాజేశారు. సరిగ్గా ఏడాదిలోపే నియంతృత్వ పోకడలతో అమరావతి ధ్వంస రచన చేసిన వైసీపీ సర్కారు కుప్పకూలిపోయింది. టీడీపీ-జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తెరపైకి వచ్చింది. అంతే పరిస్థితి మొత్తం తలకిందులైపోయింది.

కళకళలాడుతున్న ప్లాట్లు

రాజధాని కోసం భూములిచ్చిన 28,500 మంది రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను వైసీపీ ప్రభుత్వం తీవ్రనిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లపాటు వాటిని పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో కంపచెట్లతో రైతుల ప్లాట్లు అడవిలా మారిపోయాయి. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 2022 మార్చి 30న చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ఆ తీర్పులో రైతుల ప్లాట్లలో వున్న చెట్లను తొలగించి వారికి ఆరు నెలల్లో స్థలాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ గత ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందే తప్ప ఒక్క చెట్టు కూడా తొలగించలేదు. అలాంటి రైతుల ప్లాట్లు కూటమి ప్రభుత్వం రాకతో కళకళలాడుతున్నాయి. 36.5 కోట్ల రూపాయలతో కూటమి ప్రభుత్వం 24వేల ఎకరాల్లో కంపచెట్లను తొలగించింది. కిందటి నెల 7న కంప చెట్ల తొలగింపుకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టగా నెల రోజుల్లో రాజధాని స్వరూపం మారిపోయింది. కాంట్రాక్టు దక్కించుకున్న ఎన్‌సీసీ సంస్థ పనులను శరవేగంగా సాగించింది. వర్షాలు పడినప్పటికీ పనులు వేగంగా సాగేలా చూసింది. దీంతో రైతుల ప్లాట్లు అందంగా కళకళలాడుతున్నాయి.



నాడు ఆర్- 5 జోన్ ప్లాట్లు



నేడు కంపచెట్లతో అడవిలా ఆర్- 5 జోన్

అడవిలా మారిన ఆర్- 5 జోన్

రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసి, రాజధాని నిర్మాణాన్ని శాస్వతంగా సమాధి చేయాలని భావిస్తూ జగన్ సర్కార్ 2023లో 'రాజధానిలో పేదలకు ఇళ్లు' అంటూ ఆర్- 5 జోన్ చిచ్చు రాజేసింది. రాజధానికి అత్యంత కీలకమైన ఎలక్ట్రానిక్ సిటీ, ఫైనాన్షియల్ సిటీలను, పరిశ్రమలకు కేటాయించిన భూములను టార్గెట్ చేస్తూ ఆ భూముల్లో 53వేల మందికి సెంటు స్థలాలు ఇచ్చేందుకు ప్లాట్లు వేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల స్థలాల్లో చెట్ల తొలగింపుకు రూపాయి కూడా ఖర్చు చేయని వైసీపీ ప్రభుత్వం ఆర్- 5 జోన్లో ప్లాట్ల పేరుతో అక్షరాలా రూ. 130 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కంప చెట్లు తొలగించి, ప్లాట్లలో మెరక తోలించి, విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి, రోడ్లు వేయించి ఆర్- 5 జోన్‌ను సర్వాంగ సుందరంగా సిద్ధం చేసింది. రైతుల పోరాటం కారణంగా సుప్రీంకోర్టు ఆ వ్యవహారాన్ని అడ్డుకొంది. అంతే ఆర్- 5 జోన్‌కు కుట్ర ఆగిపోయింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆర్- 5 జోన్ అడవిలా మారిపోయింది. ఆర్- 5 జోన్ వ్యవహారం న్యాయస్థానాల పరిధిలో వుండడంతో కూటమి ప్రభుత్వం దాని జోలికి పోలేదు. దీంతో విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్లాట్లు మొత్తం చిల్ల కంప అల్లుకుపోయింది.

రోడ్లకు మహర్దశ

కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే రాజధానిలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. వైసీపీ పాలనలో మట్టిదిబ్బలతో, కంపచెట్లతో నిండిపోయిన సీడ్ యాక్సిస్ రోడ్డుకు మహర్దశ పట్టింది. అది తాజాగా ఎన్‌హెచ్-16తో అనుసంధానం కాబోతోంది. కంపచెట్ల తో నిండిపోయిన అంతర్గత రోడ్లు అం దంగా తయారై, వినియోగా నికి పూర్తిగా సిద్ధమయ్యాయి.



వరద బాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

- లాంఛనంగా పంపిణీ చేసిన చంద్రబాబు
- ఖాతాల్లో పరిహారం జమవుతుందని సీఎం ప్రకటన

బాధితులకు వరద సాయం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో జిల్లాలో నష్టపోయిన రైతులు, చేనేత కార్మికులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. బుధవారం సాయంత్రం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన యల్లా శివరామయ్య రెండు హెక్టార్లలో వరి పంట దెబ్బతినడంతో రూ.50 వేలు, కొల్లిపర మండలం శిరిపురం గ్రామానికి చెందిన పోపూరి రామలింగేశ్వరరావు 1.156 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నందుకు రూ.28,900, పెదకాకాని ఉప్పలపాడుకు చెందిన మానుకొండ రామకృష్ణకు 1.24 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నందుకు రూ.31 వేలు, తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన ఎం మధుశేఖర్‌కు చెందిన 1.5 ఎకరాల్లో పసుపు, అరటి, సొరకాయ పంటలు దెబ్బతిన్నందుకు రూ.53,016, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన మొవ్వా వెంకటచంద్రరావుకు చెందిన 1.41 ఎకరాల్లో పసుపు, అరటి పంటలు దెబ్బతిన్నందుకు రూ.45,322, మంగళగిరికి తుమ్మలచర్ల కుమారికి చెందిన నూలు దెబ్బతిన్నందుకు రూ.25 వేల నష్టపరిహారాన్ని సీఎం చంద్రబాబు అందజేశారు. మిగిలిన వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమవుతుందని ప్రకటించారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కంటి పాపలకు..

కష్టమొచ్చింది

- ప్రభుత్వ పాఠశాలల్లో 38,008మంది విద్యార్థులకు కంటి సమస్యలు
- ఈ విద్యా సంవత్సరంలో 3.05 లక్షల మందికి కంటి పరీక్షలు
- 5,180 మందికి ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీకి ప్రణాళిక

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: పేదరికం.. పౌష్టికాహార లోపం.. అవగాహన రాహిత్యం వెరసి పేదకుటుంబాల్లో విద్యార్థులకు కంటి సమస్యలు శాపాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి దిగ్భ్రాంతికర పరిస్థితులు భావిపౌరుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అంధత్వనివారణ సంస్థ నిర్వహించిన కంటిపరీక్షల్లో 38వేల మందికి పైగా విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అవగతం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాస్యం చేస్తున్నారు. ఇందులో అనేకమంది పౌష్టికాహారం లోపంవల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వ గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటిపరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. తొలి విడత ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరువరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థిని విద్యార్థులు ఏదో ఒక కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. వీరిలో తప్పని సరిగా కళ్ళజోళ్ళు అవసరమైన విద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వరలో కళ్ళజోళ్ళు పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యార్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్యసిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొన్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా దాదాపు 600మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేకశిక్షణ అందించారు.

కంటి సమస్యలకు ఇవీ ప్రధాన కారణాలు...

దృష్టిలోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహారలోపం, అంటువ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికరమైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారంపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహారం లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యులు చెబుతున్నారు.

ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ

- డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్



జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను ఆగస్టు నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు పాఠశాలల్లో ఉచితంగా కంటి పరీక్ష లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వనివారణ సంస్థ అధికారి డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఇప్పటికే 2.80లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 36,411 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిం చినట్లు తెలిపారు. వీరిలో 3,798 మందికి ఉచితంగా ఈ ఏడాది కళ్ళజోళ్ళు ప్రభుత్వం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న ట్లు తెలిపారు. అక్టోబరు నెలాఖరు వరకు కంటి పరీక్షల స్క్రీనింగ్ పాఠశాలల్లో జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజా పంపిణీ ప్రక్షాళన

- కొత్తగా రానున్న రేషన్ దుకాణాలు
- రేషనలైజేషన్‌తో మరికొన్ని వచ్చే అవకాశం
- గుంటూరు జిల్లాలో 176 దుకాణాల భర్తీకి చర్యలు



గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో రేషన్ దుకాణాల పునర్విభజన జరగనున్నది. అవసరం ఉన్న చోట చౌక దుకాణాల సంఖ్య పెంచేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. దుకాణాలు పెరగనుండగా వాటిపై పౌరసరఫరాల శాఖ దృష్టి సారించింది. ఈ క్రమంలో జిల్లాలో కొత్తగా మరికొన్ని రేషన్ దుకాణాలు రానున్నాయి. గ్రామీణ, పట్టణ, గుంటూరు నగరంలో రేషన్ షాపుల క్రమబద్ధీకరణ చేపట్టనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రక్రియని నిర్వహించనున్నారు. ఇందుకోసం తహసీల్దార్ కార్యాలయాల్లో కసరత్తు జరుగుతున్నది. గుంటూరు జిల్లాలో 972 రేషన్ దుకాణాలు ఉండగా వీటి ద్వారా 5,99,511 తెల్లరేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు సరుకుల పంపిణీ జరుగుతున్నది. గత వైసీపీ ప్రభుత్వం మధ్యలో ఎండీయూ వ్యవస్థని తీసుకొచ్చి ప్రజా పంపిణీపై పెను ఆర్థికభారాన్ని మోపింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది ఎండీయూలు వెళ్లిపోయారు. కొందరు మాత్రం కొనసాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కార్డుదారులు రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. కాగా పౌరసరఫరాల వ్యవస్థని పటిష్టం చేసే క్రమంలో గుంటూరులో ఒక్కో రేషన్ దుకాణానికి 600 కార్డులు మాత్రమే ఉండేలా రేషనలైజేషన్ చేయాలని ఆ శాఖ నిర్ణయించింది. తెనాలి, పొన్నూరు వంటి అర్బన్ ప్రాంతాల్లో 500 నుంచి 550 మధ్య కార్డులకు ఒక దుకాణం, గ్రామీణ ప్రాంతాల్లో 400 - 450 దుకాణాలకు ఒక షాపుని క్రమబద్ధీకరిస్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది పలుకుబడి కలిగిన డీలర్లు ఎక్కువ కార్డులు వారి షాపు పరిధిలోకి బదిలీ చేయించుకున్నారు. దీని వల్ల కొన్ని దుకాణాల్లో వెయ్యి కార్డులు పైగా ఉంటే కొన్నింటిలో 500 లోపే ఉన్నాయి. ఈ కారణంగా తక్కువ కార్డులున్న వారికి కనీసం అద్దెలు కూడా చెల్లించుకోలేని పరిస్థితి నెలకొంది. వీటిని పరిగణనలోకి తీసుకుని దుకాణాల క్రమబద్ధీకరణ ప్రక్రియని రెవెన్యూ అధికారులు చేపట్టారు. ప్రస్తుతం 176 ఖాళీలుండగా మరికొన్ని రేషనలైజేషన్ ద్వారా రాబోతున్నాయి. అక్టోబరు మొదటి వారాంతానికి రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తిచేసి జాయింట్ కలెక్టర్‌కు నివేదిస్తారు. వాటి ఆధారంగా షాపుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి మొత్తం ప్రక్రియని నవంబరు 16వ తేదీకి పూర్తి చేస్తారని డీఎస్‌వో కోమలి పద్మ తెలిపారు. ఈ క్రమంలో ఔత్సాహికులు అప్పుడే తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు.

గ్రీన్‌గ్రేస్‌లో తనిఖీలు

- సంయుక్తంగా రైల్వే, కార్పొరేషన్ రంగంలోకి
- వర్షం నీటి కారణంగా తనిఖీలకు కొంత ఆటంకం
- నేడు, రేపు ఉల్లంఘనల పరిశీలన.. ప్రభుత్వానికి నివేదిక

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర నడిమధ్యన నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ ఆకాశ హర్మ్యాల ప్రాంగణంలో రైల్వే, నగరపాలకసంస్థ శాఖలు తనిఖీలు చేపట్టాయి. బుధవారం సాయంత్రం రెండు శాఖల అధికారులు ఒక బృందంగా ఏర్పడి తనిఖీలకు దిగాయి. అయితే మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాంగణంలో చాలా చోట్ల నీరు నిలిచి బురదమయం కావడంతో పూర్తిస్థాయి తనిఖీలు సాధ్యపడలేదు. దాంతో తనిఖీలను గురు, శుక్రవారాల్లో కొనసాగించి ఉల్లంఘనలపై సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. అనంతరం నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి, దక్షిణ మధ్య రైల్వే జోనల్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపి అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలని భావిస్తున్నాయి. అధికారం అండతో అంబటి మురళీకృష్ణ జీ+15 ఆకాశహర్మ్యాల నిర్మాణంలో నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించి 500కు పైగా ఫ్లాట్లను నిర్మిస్తూ ఎన్‌వోసీలు తీసుకోలేదు. కేవలం జీ+5 భవన సముదాయాల ప్లాన్‌ను రైల్వేకు నివేదించి ఎన్‌వోసీ తీసుకున్నారు. అయితే జీ+15 భవన సముదాయాల నిర్మాణాలు చేపట్టడంతో రైల్వే శాఖ తాను జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు చేసింది. చర్యలు తీసుకోవాలని లేఖ రాసినా కార్పొరేషన్ అధికారులు అప్పట్లో నోటీసుతో సరిపెట్టారు. దీంతో నిన్నమొన్నటి వరకు నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగాయి. ఈ క్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఈ విషయాలను బయటకు తీశారో అప్పుడు అటు కార్పొరేషన్, ఇటు రైల్వేలో కదలిక ప్రారంభమైంది. ఇన్నాళ్లు అటువైపు కన్నెత్తి చూడని అధికారులు తనిఖీలు చేపట్టారు. నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇటీవల నిర్మాణాలను నిలుపుదల చేయించారు. మరోవైపు రైల్వే అధికారులు బుధవారం కార్పొరేషన్ అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లు ప్రారంభించారు. రైల్వే హద్దుకు కేవలం 50 నుంచి 60 అడుగుల దూరం లోపే గ్రీన్‌గ్రేస్ నిర్మాణాలు ఉన్న నేపథ్యంలో వాటిని తొలగించకపోతే ఇబ్బందికరమని రైల్వే అధికారులు భావిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న గ్రీన్‌గ్రేస్ భవన సముదాయం

రూ.6 కోట్ల విలువైన భవనం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్

చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి

- మూడు దొంగతనాలకు పాల్పడింది వేర్వేరు ముఠాలు
- నిందితుల కోసం రంగంలోకి ప్రత్యేక బృందాలు

6లో..

ధరల నియంత్రణకు సహకరించాలి

- వ్యాపారులకు జేసీ భార్గవతేజ సూచన

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ఉల్లి, వంట నూనెల ధరలను నియంత్రించేందుకు వ్యాపారులు సహకరించాలని జేసీ భార్గవతేజ సూచించారు. జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిందని, అయితే ఇంతకు ముందే దిగుమతి చేసుకున్న నూనెలకు పెరుగుదల వర్తించదని చెప్పినా వ్యాపారులు ధరలు పెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో రూ.60 పైన ఉల్లి ధరలు ఉన్నాయన్నారు. సామాన్యులకు సరసమైన ధరలకు నిత్యావసరాలు అందజేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా రైస్, కందిపప్పు అందిస్తున్న మాదిరిగానే వంట నూనెలకు కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉల్లి, టమాటాలకి సంబంధించి కొత్త పంట రావడం మొదలైందని, మరి కొద్ది రోజుల్లో వాటి ధరలు నియంత్రణలోకి వస్తాయని మార్కెటింగ్ డిపార్టుమెంటు అధికారులు తెలిపారు. తుఫాను, వరదలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు లాభాపేక్షతో కాకుండా ప్రజల అవసరాలు తీర్చే నిమిత్తం ప్రయత్నించాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ జగన్నాథ్, ఆర్డీవో శ్రీకర్, జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్, పప్పుల, వంటనూనెలు, బియ్యం వ్యాపారస్తుల అసోసియేషన్స్, రైతు సంఘాలు, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో పాల్గొన్న జేసీ భార్గవతేజ

అనారోగ్యంతో పోలీసు జాగిలం ఫాక్సీ మృతి


పోలీసు జాగిలం ఫాక్సీకి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడి, పోలీసు అధికారులు

బాపట్ల, సెప్టెంబరు 25: బాపట్ల జిల్లా భద్రతా విభాగంలో 2022 నుంచి విశేష సేవలందించిన పోలీసు ట్రాకర్ జాగిలం ఫాక్సీ అనారోగ్యంతో మృతి చెందింది. 5.3 సంవత్సరాల వయస్సు కలిగిన ఫాక్సీ మృతిపై ఎస్పీ తుషార్ డూడి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం డాగ్ కెన్నెల్ భవనం వద్ద ఫాక్సీ కళేబరానికి పుష్పాంజలి ఘటించారు. గౌరవవందనం చేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసులకు ట్రాకర్ విభాగంలో 2 ఏళ్లపాటు విశేష సేవలందించిందనీ, ఫాక్సీ జాగిలం మృతి చెందటం బాధాకరమన్నారు. పోలీసు కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ఫాక్సీ జాగిలంను భావించామన్నారు. నేరాలు ఛేధించటంలో చురుగ్గా, సమర్థవంతంగా పని చేసిందన్నారు. డాబర్‌మెన్ ఆడజాతికి చెందిన ఫాక్సీ జాగిలం 8 నెలలపాటు మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ట్రాకర్ విభాగంలో శిక్షణ పొందిందన్నారు. 2020 మార్చి 31న శిక్షణ పూర్తి చేసుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా రూరల్ విభాగంలో విధులు నిర్వహించిందన్నారు. ఆ సమయంలో మంగళగిరిటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసును ఛేధించటంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. 2021లో మంగళగిరిలో జరిగిన 27వ బ్యాచ్ రిఫ్రెష్ ట్రైనింగ్‌లో ట్రాకర్ విభాగంలో మొదటి స్థానం పొంది మెడల్ సాధించిందన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ యు.ఏడుకొండలు జాగిలానికి హ్యాండ్లర్‌గా వ్యవహరించారన్నారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఏఆర్‌డీఎస్పీ చంద్రమోహన్, అడ్మిన్ ఆర్‌ఐ షేక్.మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్‌ఐ శ్రీనివాస రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే దసర, దీపావళి పండగల సెలవుల దృష్ట్యా గుంటూరు మీదగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు అక్టోబరు 5, 12, 19, 26, నవంబరు 2, 9, 16, 23, 30(ప్రతీ శనివారం) తేదీలలో రాత్రి 7.15కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేట, ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ ప్రత్యేక రైలు అక్టోబరు 7, 14, 21, 28, నవంబరు 4, 11, 18, 25, డిసెంబరు 2 తేదీల్లో(ప్రతీ సోమవారం) వేకువజామున 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 6.29కి నరసరావుపేట, 7.20కి గుంటూరు మంగళవారం మధ్యాహ్నం 12.15కి భువనేశ్వర్ చేరుకొంటుందని తెలిపారు.

నేటి నుంచి జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: ఉమ్మడి జిల్లాలో ఈనెల 26 నుంచి వివిధ క్రీడాంశాల్లో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న సెపక్ తక్రా అండర్ 14, అండర్ 17 బాలబాలికల విభాగాలకు జడ్పీ స్కూల్ నందిగామ(సత్తెనపల్లి)లో నిర్వహిస్తారు. 27న అథ్లెటిక్స్ ఎంపికలు జడ్పీ స్కూల్ నంబూరులో అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఎంపిక జరుగుతుంది. 28న బాక్సింగ్ అండర్ 14, అండర్ 17 బాల బాలికల విభాగాలలో ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేటలో, బాస్కెట్‌బాల్ అండర్ 14, అండర్ 17 బాలురుకు మాత్రమే ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేటలో, 28న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ అండర్ 17, అండర్ 19 విభాగాల్లో బాల బాలికలకు డీఎస్ఏ స్టేడియం తెనాలిలో నిర్వహిస్తారని తెలిపారు. క్రీడాంశాల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

శీలంవారివీధిలో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, సెప్టెంబరు 25: కొత్తపేట శీలంవారి వీధిలో మురళి శ్రీనివాసరావు (54) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి అనారోగ్యం, ఆదరణ కరవవ్వడమేనని పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావు మెదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకున్నారు. ఇద్దరు కుమార్తెలు తల్లి వద్దే ఉంటున్నారు. శ్రీనివాసరావు మరో వివాహం చేసుకోగా ఆమెకు ముగ్గురు కుమార్తెలు సంతానం కలిగారు. వారిద్దరి మధ్య కూడా మనస్పర్థలు రావడంతో విడిపోయారు. శ్రీనివాసరావు గతంలో హైదరాబాద్, గుంటూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. ఆయనకు మధుమేహ వ్యాధి ఉండటంతో ఇటీవల కాలుకు దెబ్బతగిలి నడవలేక మంచానికి పరిమితమయ్యాడు. ఈ క్రమంలో తన అన్న భోజనం పెడుతుండే వాడు. ఆరోగ్యం దెబ్బతినడం, కుటుబ సభ్యుల నిరాదరణ వంటి కారణాలతో మనస్తాపానికి గురై సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల్లో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు


డిప్యూటీ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న అంధ ఉద్యోగి ఇళయరాజా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25: గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ఒక అధికారికి చూపు బాగానే కనిపిస్తుంది. అయినా ఆయనకు చూపు లేదన్న పేరుతో గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో చోటు కల్పించారు. అందుకోసం నిబంధనలు, జీవోలను అడ్డం పెట్టారు. పొన్నూరు మండలం నిడుబ్రోలు జెడ్పీ పాఠశాలలో అటెండర్‌గా పనిచేసే బత్తుల ఇళయరాజా నూరుశాతం అంధ ఉద్యోగి. ఆయన్ను దూరంలోని చింతలపూడికి బదిలీ చేశారు. గుంటూరు జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీల్లో ఇటువంటి ఉదంతాలు తరుచూ జరుగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలను తుంగలో తొక్కి పోస్టింగ్‌లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం కూడా చాలా మంది ఉద్యోగులు ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇచ్చినా తమకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. వినుకొండ నియోజకవర్గంలోని ఈపూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.రవికుమార్‌ను రొంపిచర్ల మండలానికి బదిలీ చేశారు. రవికుమార్‌ను ఈపూరులోనే కొనసాగించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు లేఖ ఇచ్చారు. అంతేకాకుండా రవికుమార్ ఎన్‌జీవో అసోసియేషన్‌లో కూడా ఉన్నారు. అయినా బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు.

అన్ని లేఖల పరిస్థితి అంతే...

పి.వెంకట రాజారాం కారంపూడి ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్నారు. ఆయన్ను జెడ్పీలోని పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీ చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే లేఖ ఇచ్చారు. మరో ముఖ్యమైన నేత కార్యాలయం నుంచి కూడా సిఫార్సు చేశారు. ఆ విజ్ఞప్తిని పూర్తిగా బుట్ట దాఖలు చేశారు. సదరు ఉద్యోగి ముఖ్యనేత కార్యాలయంలో ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా జెడ్పీ బదిలీల్లో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు లు వెళ్లాయి. కొందరు ప్రజాప్రతినిధులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అక్టోబర్ 2 వరకు ఉండాల్సిందే..

జెడ్పీ బదిలీల్లో కీలకంగా ఉన్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు నెల్లూరుకు బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం రిలీవ్ అయ్యేందుకు సిద్ధ పడ్డారు. అయితే కలెక్టర్ కార్యాలయం నుంచి రిలీవ్ చేయవద్దని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అక్టోబర్ 2 తర్వాత రిలీవ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

చిన నారాయణమ్మకు ఘన నివాళి

● పెద్దకర్మకు హాజరైన ప్రముఖులు


చిన నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, ప్రముఖులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 25: స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి చిన నారాయణమ్మ పెద్దకర్మను పురస్కరించుకుని పలువురు మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు బుధవారం చిలకలూరిపేటకు తరలివచ్చారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో చిన నారాయణమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. చిన నారాయణమ్మ కుమారుడు ప్రత్తిపాటి పుల్లారావు, కోడలు వెంకటకుమారితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ ఆంజనేయులు, బూర్ల రామాంజనేయులు, చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చింతమనేని ప్రభాకర్, తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహనరావు, మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, మక్కెన మల్లికార్జునరావు, బొల్లినేని వెంకటరామారావు, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సినీ నిర్మాత, నటుడు కొల్లా అశోక్‌కుమార్, సహా పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చిన నారాయణమ్మ పెద్దకర్మ సందర్భంగా వేలాదిమందికి ప్రత్తిపాటి గార్డెన్స్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వేలాదిమంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమానికి తరలివచ్చారు.

సచ్చిదానందమూర్తి నేటి తరానికి స్ఫూర్తి

● నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై ఆచార్య గంగాధర్‌రావు, త్రిమూర్తులు

పెదకాకాని, సెప్టెంబరు 25: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్‌ను నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేశారు. కార్యక్రమానికి నందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జన్మించిన గొప్ప తత్వవేత్త సచ్చిదానందమూర్తి అని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తి అని, నేటి యువత ఆయన సూచించిన రాడికల్ ఫిలాసఫీని అనుసరించాలని సూచించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రానికి కొత్త భాష్యం చెప్పిన ప్రఖ్యాత తత్వవేత్త అని, భారతీయ తత్వ శాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారని పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ భారతీయ తత్వవేత్తల్లో ప్రముఖులైన ఆచార్య కొత్తా సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి ఎన్నో గ్రంథాలను ఆంగ్లం, తెలుగు, హిందీలో కూడా రచించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు కొత్త సచ్చిదానందమూర్తి బోధనలను తమ జీవితంలో అనువదించుకోవాలని సూచించారు. వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్. స్వరూపారాణి, ఆచార్య కె.వీరయ్య , ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఏ .ప్రమీలా రాణి, అధ్యాపక సంఘం, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.6 కోట్ల విలువైన భవనం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్


మంత్రి మనోహర్‌కు రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందజేస్తున్న కస్తూరిభాయ్

తెనాలి రూరల్, సెప్టెంబరు 25: మహిళా మండలి నెలకొల్పి దాని ద్వారా అనేక మందికి సహాయ సహకారాలందిస్తూ వృద్ధాప్యం దరిచేరడంతో సుమారు రూ.6 కోట్ల విలువజేసే ఆ భవనాన్ని ప్రభుత్వానికి అందించి ముద్దన కస్తూరిభాయ్ గొప్పమనస్సును చాటుకున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని కొత్తపేటలో మహిళా మండలి భవనాన్ని బుధవారం ముద్దన కస్తూరిభాయ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ప్రభుత్వానికి రాసి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ ఆమెను అభినందించారు. మనోహర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కస్తూరిభాయ్ ఎనలేని సేవలందించారన్నారు. రూ.6 కోట్ల విలువజేసే భవనాన్ని మంచి ప్రభుత్వానికి అందించాలన్న ఆకాంక్షతో దానిని కాపాడుకుంటూ వచ్చి, నేడు కూటమి ప్రభుత్వానికి అందించారని, ఆమె మంచి మనస్సుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కస్తూరి భాయ్ మాట్లాడుతూ మహిళా మండలి ద్వారా మహిళల అభ్యున్నతికి కృషి చేశామని తెలిపారు. తనకు వృద్ధాప్యం దరిచేరడంతో మంచి ప్రభుత్వానికి భవనాన్ని రాసి ఇచ్చి మహిళల శ్రేయస్సుకు, మంచి కార్యక్రమాలకు వినియోగించేలా అప్పగించాలని భావించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవనాన్ని అప్పగించాలని నిర్ణయించుకుని మంత్రి మనోహర్, అధికారుల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. తొలుత మంత్రి మనోహర్ ఆమెపై పూలు చల్లుతూ భవనంలోకి ఘన స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, తహసీల్దార్ గోపాల కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు పాల్గొన్నారు

చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి

●మూడు దొంగతనాలకు పాల్పడింది వేర్వేరు ముఠాలు

●నిందితుల కోసం రంగంలోకి ప్రత్యేక బృందాలు

గుంటూరు, సెప్టెంబరు 25: కేవలం మూడు రోజుల్లో మూడు దొంగతనాలకు పాల్పడి నగరవాసులను కలవరానికి గురిచేసిన కేసుల దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. రెండు చోరీ కేసుల్లో నిందితులను ఇప్పటికే పోలీసులు గుర్తించగా, మూడో కేసులో నిందితులను గుర్తించేందుకు అనుమానితుల జాబితాను తిరగేస్తున్నారు. అపార్టుమెంట్‌లో విశ్రాంత డీఎస్పీ జి. పెంచలనాయుడు ఇంటిలో జరిగిన చోరీకి నిందితులు కారులో వచ్చారు. వారు కింద నుంచి పైవరకు రెండు దఫాలు తిరగడంతో సీసీ కెమెరాల్లో స్పష్టంగా వారి ఆనువాళ్లు కనిపించాయి. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు వరుసకు అన్నదమ్ములని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వీరిలో ఒకరు హైదరాబాదులో ఉంటుండగా, మరొకరు మహారాష్ట్రలో ఉంటున్నట్లు తేలింది. కారులో వచ్చి చోరీకి పాల్పడిన అనంతరం నిందితులు నేరుగా హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి తిరిగి మహారాష్ట్రకు వెళ్లినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో హైదరాబాదులో ఉంటున్న ఓ నిందితుడి కుటుంబ సభ్యులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇటీవలే ఆ కారును కొనుగోలు చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. వీరు కర్ణాటక వెళ్లాక సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో వారి కదలికలు ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందాలు తరలివెళ్లాయి. వీరు గుంటూరులో చోరీ చేయడానికి ముందు ముంబాయిలోనూ, ఆ తరువాత విశాఖపట్నంలోనూ చోరీ చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. పరిస్థితులను బట్టి వీరు విమానాల్లోనూ తిరుగుతుంటారని తెలిసింది. గతంలో వీరు హైదరాబాద్‌లో ఎనిమిది కిలోల బంగారం చోరీ చేసిన కేసులోనూ పట్టుబడ్డారు. ఎస్వీఎన్ కాలనీలో ఫైనాన్స్ వ్యాపారి శంకర్ ఇంటిలో ఐదు రోజుల క్రితం పట్ట పగలు జరిగిన చోరీ కేసులో కొంత పురోగతి సాధించారు. నిందితుడిని రాజమండ్రికి చెందిన శామ్యూల్‌రాజ్‌గా గుర్తించారు. అయితే ప్రస్తుతం నిందితుడు వేరే రాష్ట్రానికి వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన నిందితుడు విజయవాడ వెళ్లి అక్కడ నుంచి రైలులో వేరే రాష్ట్రానికి వెళ్లినట్లు తెలుస్తోంది. నిందితుడు వీధులవెంట తిరుగుతూ, పొలాల్లో నిద్రిస్తూ చోరీలు చేస్తుంటాడని పోలీసులు అంటున్నారు. కేరాఫ్ లేకపోవడంతో ఇతన్ని పట్టుకోవడం కొంత ఇబ్బందిగా ఉంటుందని పోలీస్ వర్గాలు అంటున్నాయి. ఎస్వీఎన్ కాలనీలోని బాంబే డయింగ్ కాలనీలో గల విశ్రాంత తపాలా ఉద్యోగి సూర్యనారాయణ ఇంటిలో జరిగిన చోరీ కేసులో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

వినుకొండ, సెప్టెంబరు 25: దొంగ యాత్రలు, ఆలయ ప్రదర్శనలు చేస్తే చేసిన పాపాలు ఊరికే పోవని, సాక్షాత్తూ కలియుగ వైకుంఠ స్వామికి ద్రోహం చేసిన జగన్‌రెడ్డి ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి తిరుమల తిరుపతిలో చేయరాని పాపాలు చేశారని తెలిపారు. సంప్రదాయాలను తుంగలో తొక్కి కోట్లాది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసి పెద్ద నేరానికి పాల్పడ్డారన్నారు. వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో అన్య మతస్థులను పెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని తిరుమలలో దోపిడీ చేశారని ఆరోపించారు. జగన్ రెడ్డి అవినీతి, స్వార్థం కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ కేవలం మూడు నెలల్లోనే వినుకొండ పట్టణం అభివృద్ధి జీవీ ఆంజనేయులు కృషి చేయడం ద్వారా జరుగుతుందని తెలిపారు. పి.వి. సురేష్ పత్తిపూర్ణ, మురళీకృష్ణ యాదవ్, కుంటా కోటిరెడ్డి పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లపై సర్వే

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 25: జిల్లాలో ప్రబలిన కాక్‌టెయిల్ వైరల్ ఫీవర్ల వ్యాప్తిని తెలుసుకొనేందుకు ఎపిడమియాలజికల్ సర్వే చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి వెల్లడించారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంభవిస్తున్న మిక్స్‌డ్ ఫీవర్లలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా తదితర జ్వరాలను గుర్తించేందుకు, శాస్త్రీయ పరిష్కారాలను సూచించేందుకు ఈ సర్వే దోహదపడుతుందని ఆమె తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో ఆమె వైరల్ ఫీవర్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. "కాక్‌టెయిల్ వైరస్ కలకలం" శీర్షికన ఈ నెల 24వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వెలువడిన కథనంపై డీఎంహెచ్‌వో స్పందించారు. బాధితుల్లో పలు రకాల వైరల్ ఫీవర్ లక్షణాలు కనిపిస్తున్నట్లు ప్రచురించగా, వీటిపై అధ్యయనం చేసేందుకు ఆమె చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరు వైద్య కళాశాల సామాజిక వ్యాధి నిరోధక విభాగానికి చెందిన వైద్యనిపుణులతో సమావేశమయ్యారు. ఎస్పీఎం హెచ్‌వోడీ డాక్టర్ ఏ.సీతారామ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ్‌కుమార్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ వైద్యనిపుణులతో పాటు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఎపిడమియాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డెమో ఏ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా అంబటి

● పల్నాడు బాధ్యతలు మళ్లీ పిన్నెల్లికే..

గుంటూరు, సెప్టెంబరు 25: సార్వత్రిక ఎన్నికల తరువాత పూర్తి నిస్సత్తువలో ఉన్న వైసీపీకి జిల్లాల అధ్యక్షుల నియామకాలను చేపట్టారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడుగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు పార్టీ పరిశీలకుడుగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా దొంతిరెడ్డి వేమారెడ్డిని నియమిస్తూ జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలతో తాడేపల్లి కార్యాలయంలో మాజీ సీఎం జగన్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు విడదల రజనీ, మేకతోటి సుచరిత, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, షేక్ నూరిఫాతిమా, అంబటి మురళి హాజరైయ్యారు.

ఏఎన్ఎంలకు ఇతర విధులు కేటాయించొద్దు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25: వైద్య, ఆరోగ్య కార్యక్రమాల్లో నిత్యం పని ఒత్తిడితో ఉంటున్న ఏఎన్ఎంలకు ఇతర విధులు కేటాయించవద్దని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఎన్ఎంలు సాధారణ టీకాలు, ఫ్రైడే, డ్రైడే, ఆర్‌సీహెచ్, సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాల నిర్వహణ, ఎన్‌సీడీసీడీ సర్వే, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. అటువంటి తరుణంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో ఏఎన్ఎంలను భాగస్వామ్యం చేయడం దారుణమన్నారు. ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు కూడా ఇతర సర్వే పనులు ఏఎన్ఎంకు అప్పగిస్తున్నారని అన్నారు. దీనివలన ఫీడర్ క్యాడర్‌కి రావాల్సిన పదోన్నతుల అవకాశాలు తగ్గి ఉద్యోగులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల కు మేలు చేసే 100 శాతం గ్రాస్ శాలరీ జీవోను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులను ఎఫ్ఆర్ఎస్ పేరుతో ఇబ్బందులకు గురిచేసిందనీ, అందువల్లే ఉద్యోగులు కూటమి ప్రభుత్వం రావాలని కోరుకున్నారని అన్నారు.

800 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం లారీని తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్ఐ గండు కిరణ్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25: అర్ధరాత్రి గుంటూరు వైపు వెళ్తున్న లారీని పొన్నూరు రూరల్ పోలీసులు అనుమానంతో ఆపి తనిఖీ చేయగా బియ్యం బస్తాలు ఉన్నాయి. అవి రేషన్ బియ్యంగా అనుమానించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ సీఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం మంగళవారం రాత్రి రూరల్ ఎస్సై గండు కిరణ్ గస్తీ నిర్వహిస్తుండగా చింతలపూడి వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. బాపట్ల నుంచి తెలంగాణలోని ఖమ్మం జిల్లా మదిరకు బియ్యం లోడు చేసుకుని వెళ్తున్నట్లు డ్రైవర్ సమాధానం ఇచ్చాడు. అయితే ఈ బియ్యం రేషన్ బియ్యంగా అనుమానించి పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. సివిల్ సప్లయి డీటీ భువనేశ్వరి లారీలోని బియ్యాని తనిఖీ చేసి నిర్ధారణ కోసం జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయితే ప్రాథమిక పరిశీలనలో ఈ బియ్యం రేషన్ బియ్యంను రీసైక్లింగ్ చేసినట్టుగా గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. లారీలో 25 కిలోల చొప్పున 800 బస్తాల బియ్యం విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

న్యూరో విభాగానికి రూ.4 లక్షల విరాళం

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 25: ఏపీ న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాలకు చెరో రూ.2 లక్షల చొప్పున రూ.4 లక్షల విరాళం అందజేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, డాక్టర్ వీర్ తారక్‌నాథ్, డాక్టర్ సీహెచ్ శివరామకృష్ణ తదితరులు ఈ విరాళం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన న్యూరోసైంటిస్టుల అసోసియేషన్ వార్షికోత్సవ సదస్సు విజయవంతం కావడం వెనుక ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ వైద్యనిపుణుల కృషి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా విభాగాల అభివృద్ధికి ఈ విరాళం అందజేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. తమకు వచ్చిన రూ.2 లక్షల విరాళంతో న్యూరాలజీ విభాగం వైద్యులు ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

51,039 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,149 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,039 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,374 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	17000	334	9000	15700
నెంబరు. 5	9000	17000	నెంబరు. 5	9000	11500
273	11500	14000	273	--	--
341	9000	16000	341	9000	16500
4884	12500	13700	4884	13200	15000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18600	తేజ	9000	18700
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	8000	16000	దేవనూరు డీలక్స్	13000	16500
తెల్లకాయలు	5500	11500	తెల్లకాయలు	6500	10600

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిళ్లను పునఃప్రారంభించాలి

● కలెక్టర్‌కు టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ విజ్ఞాపన


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొర్రపాటి సురేశ్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25: స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవనాన్ని పూర్తి చేసి, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్‌ను పునఃప్రారంభించాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిపి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించారని, ఆ నిధులతో సగం పూర్తి చేశారని అన్నారు. ఆ తర్వాత అప్పటి మంత్రి నక్కా ఆనంద బాబు రూ.6 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వెనక్కి తీసుకోవడంతో దీని నిర్మాణం ఆగిపోయిందని అన్నారు. మళ్లీ తిరిగి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో దీని నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా అంచనాలు రూపొందించి అంబేద్కర్ భవన్ నిర్మాణం పూర్తి చేసి, ఎస్సీ ఎస్టీ స్టడీ సర్కిల్స్ కూడా పునఃప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు.

ఆర్టిస్టిక్ స్కేటింగ్ క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన


జెస్సీ రాజ్‌ను అభినందిస్తున్న కలెక్టర్

గుంటూరు(తూర్పు),సెప్టెంబరు 25: ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ స్కేట్ ఓషేరియా ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన మంగళగిరికి చెందిన జెస్సీ రాజ్‌ను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ ప్రత్యేకంగా అభి నందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, దేశపు కీర్తి ప్రతిష్ఠలు పెంపొం దించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం ముంబయికి చెందిన మహావతార్ బాబాజీ తాదేకం ఫౌండేషన్ (ఎమ్‌బీటీఎఫ్) అందించిన రూ.50 వేల చెక్కును జెస్సీ రాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ కోఆర్డినేటర్ వై.సాయి సుధ, క్రీడాకారిణీ తల్లిదండ్రులు సురేష్, రాధ, డీపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు
సీతారామయ్య హైస్కూల్ విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణు వర్ధన్, తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 25: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో పాటిబండ్ల సీతారామయ్య (సీబీఎస్ఇ) హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పీ. శ్రావణి అండర్-17 పోటీలలో పాల్గొని స్టేట్ లెవెల్‌కు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ బుధవారం తెలిపారు. విద్యార్థినిని, ఆమెను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి దేవినేని శేష గిరిరావు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ పాల్గొన్నారు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిప్స్‌లో ముగిసిన ఫార్మసిస్ట్ దినోత్సవం

గుంటూరు(విద్య),సెప్టెంబరు 26: స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో రెండురోజులుగా నిర్వహిసున్న ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డాక్టర్ జంపని సుబ్బారావు ఆధ్వర్యంలో చౌడవరంలోని లలితానగర్‌లో మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు విద్యార్థులు నిర్వహించారు. అతిగా మందులు వాడకం వల్ల కలిగే నష్టాల గురించి గ్రామీణులకు వివరించారు. ఓబులునాయుడుపాలెంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర గురించి ర్యాలీ నిర్వహించిన అనంతరం గుంటూరులోని కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ సీఎస్ శ్రీనివాస్,కోశాధికారి డాక్టర్ రాయపాటి గోపాలకృష్ణ,అదనపు కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు అభినందించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్ విధి విధానాలు

● పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య

గుంటూరు, సెప్టెంబరు 25: ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేసే విధి విధానాలను పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో వివరించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన విధానాలను, ప్రవర్తనా నియమావళిలోని అంశాలను అతిక్రమించిన సందర్భాల్లో విధానాల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారన్నారు. సాధారణంగా ఒక ఉద్యోగి ఏ పరిస్థితుల్లో అనిశ్చితికి గురి చేస్తారో వివరాలు ఇలా ఉన్నాయని వివరించారు.

● ఉద్యోగిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు , లేక అతనిపై ఇంతకు ముందే క్రమశిక్షణా చర్యలు ప్రారంభమై పెండింగ్‌లో ఉన్నప్పుడు సస్పెండ్ చేస్తారు.

● రాష్ట్ర భద్రతకు, శ్రేయస్సుకు ముప్పు కలిగించే కార్యక్రమాల్లో ఉద్యోగి పాల్గొన్న సందర్భాల్లో సస్పెండ్ చేసే అవకాశం ఉందన్నారు. ఉద్యోగి క్రిమినల్ కేసులలో నిందితుడిగా ఉంటూ అతనిపై నేర పరిశోధన చేసే సందర్భాల్లో కానీ విచారణ ఉన్నప్పుడు కానీ లేక కేసు సత్య సోదన సందర్భాల్లో కానీ సస్పెండ్ చేయవచ్చు.

● ఒక ఉద్యోగి తన ఉద్యోగ నిర్వహణకు సంబంధం లేని ఇతర నేరాలలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సందర్భాల్లో సస్పెండ్ చేయవచ్చని సీసీఏ రూల్స్ -1991లోని రూల్ 8కి మార్పులు చేస్తూ జీవో నెంబరు 27ను ప్రభుత్వం జారీ చేసింది.

● కుంభకోణాలు జరిగిన కార్యాలయంలో ఉద్యోగి విధులలో కొనసాగించటం ప్రజా సంక్షేమానికి విరుద్ధమని ప్రభుత్వం భావించి నిజాయితీకి నిరూపణగా సంబంధిత ఉద్యోగిని సస్పెండ్ చేయవచ్చు.

● ఉద్యోగి పై వచ్చిన ఆరోపణలపై ప్రథమ విచారణలో తెలిసిన నిజాల ఆధారంగా అతనిపై శాఖాపరంగా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని భావించిన సందర్భాల్లో సస్పెండ్ చేస్తారు.

● ఉద్యోగి అనైతిక ప్రవర్తన ద్వారా నీతి భ్రంశంతో కూడిన నేరం చేసినప్పుడు సస్పెండ్ అవుతారు.

● అవినీతికి పాల్పడినప్పుడు , ప్రభుత్వ సొమ్మును, దుర్వినియోగం చేసినప్పుడు , అపహరించినప్పుడు సస్పెండ్ చేస్తారు.


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

కూలి రేట్లను పెంచండి

● కళ్లకు గంతలతో ముఠా కార్మికుల వినూత్న నిరసన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25: సివిల్ సప్లయిస్ కార్మికుల కూలి రేట్లను పెంచాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ముఠా కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల కూలి రేట్ల అగ్రిమెంట్ 9 నెలలు పూర్తయినా ఇంత వరకూ పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కూలి రేట్ల పెంపుదల జీవోను విడుదల చేయాలని కోరారు.

నట నిఘంటవు అక్కినేని

గుంటూరు, సెప్టెంబరు 25: భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరం అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ సినీ రంగ విశ్లేషకులు అమరాచారి ప్రశంసించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అక్కినేని శత జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 వసంతాల జీవితంలో 70 వసంతాలకు అభినయ కళకు అర్పించిన నట నిఘంటవు అక్కినేని అని కీర్తించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, వీఎస్ఎన్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, వేదికపై కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 25: రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికతతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యు మెంట్ ప్రజల భాగస్వామ్యం, అభిప్రాయాలతో రూపొందుతుందని గుం టూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధ వారం స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని బుడంపాడు, పాతగుంటూరులో జరిగిన వార్డు సభల్లో స్థానిక ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గత 100 రోజుల పాలనపై ప్రజలు ఎంతో మద్దతు తెలుపుతున్నారని, పింఛన్‌ల పెంపు, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారం నామమాత్రపు ధరకు అందించడం, మెగా డీఎస్సీ ద్వారా అభివృద్ధి, సంక్షేమమే తమ అధిక ప్రాధాన్యత అంశాలని అని ప్రభుత్వం ఆచరణలో నిరూపిస్తుందన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా అభివృద్ధి చెందాలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికే నగరంలోని 57 డివిజన్లలో వార్డు సభలు నిర్వహిస్తున్ననట్లు చెప్పారు. విద్యా, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఏ విధంగా అభివృద్ధి చెందాలో క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా వచ్చే అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. కోడ్ స్కాన్ చేయడంపై సచివాలయ కార్యదర్శులు ప్రజలకు సహాయపడతారని అన్నారు. బుడంపాడులోని అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, పీకల వాగు గండ్లపై సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామని తెలిపారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ భావి తరాలకు స్వర్ణాంధ్రని అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో విజన్‌తో ఈ డాక్యుమెంట్ రూపొందించడంలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారన్నారు. బుడంపాడులోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారని అన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ముఖ్యమంత్రి తీర్చిదిద్దుతారని, విజన్ డాక్యుమెంట్ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆశాకిరణంగా నిలుస్తుందని, అందుకు ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను అందించాలని కోరారు. అనంతరం ఆయా సభల్లో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించిన వినతి పత్రాలను ఎమ్మెల్యేలు, కమిషనర్, అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, డిప్యూటీ సిటి ప్లానర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు దాసరి లక్ష్మీ దుర్గ, షేక్ మీరావలి, ఈఈ కొండారెడ్డి, డిఈఈలు కళ్యాణరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

వార్డుల వారీగా ప్రతిపాదన సిద్ధం చేయాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బుడంపాడులోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలకు డ్రెయిన్లలో నీరు రోడ్లపైకి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాపై ఫిర్యాదులను అధిక ప్రాధాన్యతతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పర్యటనలో ఈఈ కొండారెడ్డి, డిసిపి శ్రీనివాస్, డిఈఈ కళ్యాణరావు, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విరాళమివ్వకుండా జగన్ విమర్శలా!: ఎమ్మెల్యే మాధవి


అడపా సూరమ్మ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ రెడ్డి ప్రకటించిన కోటి రూపాయల విరాళాన్ని అందించిన తర్వాత తమను విమర్శిస్తే బాగుంటుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి విమర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి పైకప్పు కూలి చనిపోయిన అడపాబజార్‌కు చెందిన, అడపా సూరమ్మ కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరఫున బుధవారం పరిహారం అందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సమయంలో ఈ అంశం ఎమ్మెల్యే దృష్టికి రాగా ఆమె వెంటనే స్పందించి సత్వర చర్యలు తీసుకున్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే స్పందించిన ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయగా, ఆ చెక్కు బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి న్యాయం చేయటానికి కృషి చేసిన ఎమ్మెల్యేకి, ప్రభుత్వానికి బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి, వారికి సత్వరమే న్యాయం జరిగేలా ఈ చెక్కును సూరమ్మ కుమారుడు శ్రీనివాసరావుకు అందించామని చెప్పారు.

పాలనలో ప్రజల భాగస్వామ్యమే చంద్రబాబు ఘనత

పాలనలో ప్రజలను భాగస్వాములను చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే మాధవి అన్నారు. స్థానిక ఆంజ నేయ నగర్‌లో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. జనసేన పార్టీ నాయకులు జీ. వెంకటేశ్వర రావు, బీ.శ్రీనివాస్‌యాదవ్, వీ.శ్రీరామ్ ప్రసాద్, ఎం.మ్యాని, ఎల్.ఉదయ్ కుమార్, పీ.శ్రీకాంత్, ఎం.శివప్రసాద్, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటి పెద్దకొడుకు చంద్రబాబు: ఎమ్మెల్యే నసీర్


స్వర్ణాంధ్ర-2047 సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన నగర కమిషనర్ పులి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సజీల

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకు నిర్వహించే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొని అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నాడని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు పట్టణంలోని 12వ డివిజన్‌లోని లాల్ జాన్ బాషా కళ్యాణ మండపంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి, అభివృద్ధి కూడా ఆరంభించి మొదటి వంద రోజుల పాలనలోనే 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణ, కార్పొరేటర్ చిష్టి, క్లస్టర్ ఇంచార్జ్ హఫీజ్, జనసేన నాయకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విజనరీ నేత చంద్రబాబు

స్వర్ణాంధ్ర-2047 నాటికి అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తొలి మూడు అగ్రగామి దేశాలలో ఒకటిగా ఉండాలని ఆలోచన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచంలోనే గొప్ప విజన్ ఉన్న నాయకుడని ఎమ్మెల్యే నసీర్ ప్రశంసించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పలు డివిజన్లలో నిర్వహించిన స్వర్ణాంధ్ర 2047 సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్య క్రమంలో కార్పొరేటర్ సజీల పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

స్థానిక సంగడిగుంటలో షిర్డీ సాయిబాబా భక్తుడు ప్రైవేటుగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే నసీర్ బుధవారం శంకుస్థాపన చేశారు. సంగడిగుంటలోని సాయిబాబా మందిర వ్యవస్థాపకుడు రావూరి లక్ష్మీ నారాయణ శాస్త్రి గుడికి వెళ్లేందుకు వీలుగా తన సొంత డబ్బుతో ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు.

వరదబాధితుల కోసం రూ.2 లక్షల చెక్కు అందజేత

తెలుగు మహిళా నాయకురాలు సత్యవాణి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి రూ. 2 లక్షల చెక్కు అందజేశారు. మారెళ్ల రామకృష్ణ, మారెళ్ల వెంకట రమణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని రాష్ట్ర సచివాలయంలో కలిసి ఈ చెక్కును అందజేశారు.

గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణంకు నివాళి

గుంటూరు(తూర్పు),సెప్టెంబరు 25: గానగంధర్వుడు, తెలుగు పాటలకు చిరునామా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్ కొనియాడారు. బుధవారం కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో స్థానిక నాజ్ సెంటర్ ఐలాండ్ వద్ద ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ నిర్వహించారు. బాలు కాంస్యవిగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం హోటల్ ఆర్చిడ్‌లో జరిగిన బాలు స్వర నీరాజనం సంగీత విభావరి ఆకట్టుకుంది.


మొక్కలు నాటుతున్న ఇన్‌ఛార్జ్ అధికారి హనుమంతరావు, కార్పొరేటర్ పద్మజ తదితరులు

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

● జాతీయ నమూనా సర్వే కార్యాలయం ఇన్‌ఛార్జ్ అధికారి హనుమంతరావు

గుంటూరు, సెప్టెంబరు 25: పరిసరాల పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వాములు కావాలని భారత ప్రభుత్వ, ఉప ప్రాంతీయ కార్యాలయం ఇన్‌ఛార్జ్ అధికారి డీ.హనుమంతరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ - 2024 కార్యక్రమంలో భాగంగా అడవి తక్కెళ్ళపాడులోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చెత్తను తొలగించడం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తి ని అందరూ కొనసాగించాలని ఆయన సూచించారు. కార్పొరేటర్ పద్మజ, ప్రధానోపాధ్యాయుడు, జయశ్రీ ఉన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్

సామాజిక దృక్పథాన్నిపెంపొందించుకోవాలి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 25: ప్రతి విద్యార్థికి విద్యతో పాటుగా సామాజిక సేవాదృక్పథం అవసరమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ .రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. విపత్తులు సంభవించిన నప్పుడు విద్యార్థుల సేవలు ఎంతోకీలకమౌతాయని తెలి పారు. విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచనం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపనం, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జే.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని, కార్యదర్శి ఆర్. గోపాల, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్ మరో డ్రామా : మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో గత ఐదేళ్ల పాటు వైసీపీ చేసిన పాపాలు, తప్పులను కప్పిపుచుకునేందుకు మరో డ్రామాకు తెర తీసిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలరె మభ్య పెట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలంటూ జగన్‌రెడ్డి నయా డ్రామాకు తెర తీశారన్నారు. పాపప్రక్షాళన పేరుతో ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో పూజలు చేయాలని జగన్ పిలుపు ఇవ్వడం చూస్తుంటే 'ఆత్మశుద్ధిలేని యాచార మదిమేల' అనే వేమన పద్యం గుర్తుకు వస్తోందన్నారు. జగన్ చేసిన తప్పులకు శిక్ష అనుభించాలని, లేదం టే ప్రజలు క్షమించినా ఆ దేవుడు క్షమించడని మోహనకృష్ణ హెచ్చరించారు.

విజ్ఞాన్ ఆధ్వర్యంలో గృహ సామగ్రి పంపిణీ


సామగ్రి పంపిణీ చేస్తున్న విద్యార్థులు,అధ్యాపకులు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 25: స్థానిక వడ్లమూడి విజ్ఞాన్ యూని వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో తాడేపల్లిలోని వరద బాధితులకు రూ.5 లక్షల విలువగల గృహ సామాగ్రి పంపిణీ చేశారని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పాల్గొని గృహ సామాగ్రితో కూడిన బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన తాడేపల్లి మండలంలోని నులకపేట సమీప ప్రాంతాల్లోని 500 కుటుం బాలకు గృహ సామగ్రి పంపిణీ చేశామన్నారు.

పెదకాకాని శివాలయంలో 29 నుంచి పవిత్రోత్సవాలు

పెదకాకాని, సెప్టెంబర్ 25 : పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా దేవస్థానంలో శ్రీ స్వామి, అమ్మవార్లకు జరిగే ఆర్జిత సేవలు, రాహుకేతు పూజలు, నవగ్రహపూజలు, రుద్ర, చండీ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, శాంతి కళ్యాణములు అన్ని సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి అమావాస్య సందర్భంగా 2 వ తేదీ ఉదయం గం. 6:00 నుండి రాహుకేతు పూజలు, శ్రీ స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు,అన్ని ఆర్జీత సేవలు యదావిధిగా భక్తులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఇంటిలిజెన్స్ డీఎస్పీగా సుధాకర్ బాధ్యతలు స్వీకరణ


ఎస్పీ సతీష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంటలిజెన్స్ డీఎస్పీ సుధాకర్

గుంటూరు, సెప్టెంబరు 25 : ఇంటిలిజెన్స్ డీఎస్పీగా నియమితులైన కొనన సుధా కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ ఐజీ కార్యాలయంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ బాబు ఇటీవలే డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. తాజాగా జరిగిన బదిలీల్లో గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా నియమితులయ్యారు. బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా ఎస్పీ సతీష్ కుమార్‌ని కలిశారు.

పట్నంబజార్‌లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి

● అధికారులకు ఎస్పీ సతీష్‌కుమార్ దిశానిర్దేశం

గుంటూరు, సెప్టెంబరు 25 : పట్నంబజార్‌లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్నంబజార్ ప్రాంతంలో పర్యటించి ట్రాఫిక్ సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్‌ను, ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పట్నంబజార్ రోడ్డులో ఆకస్మికంగా పర్యటించారు. రానున్న విజయదశమి పండుగ సందర్భంగా ఆ రోడ్డు చాలా కీలకమైనందున ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేసిన ట్రాఫిక్ అధికారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హిమని సెంటర్ నుండి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి వరకు నిత్యం రద్దీగా ఉండే పట్నంబజార్‌లో ఇటీవల మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారుల సమన్వయంతో సదరు రోడ్డులో సెంటర్ పార్కింగ్ తీసివేసి ట్రాఫిక్ జామ్ కాకుండా తగిన విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా వాహనదారులు ఇబ్బంది పడకుండా, విజయదశమికి ఆ రోడ్డు కీలకమైన నేపథ్యంలో అమ్మవారి గుడికి వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలియజేశారు. ట్రాఫిక్ డి ఎస్ పి రమేష్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సి ఐ శ్రీనివాసరావు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

నెలరోజులుగా.. మురుగునీరే మంచినీరు!

● ఫిర్యాదు చేసినా స్పందించని కార్పొరేషన్ అధికారులు

గుంటూరు, సెప్టెంబర్ 25 : గడిచిన నెల రోజులుగా అరండల్‌పేట 12 వ లైన్ లో మంచినీటి పైపులైనులో మురుగునీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ విషయాన్ని నగరపాలక సంస్థ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో తాగునీటితో పాటు ఇంట్లో వంటకు వాడుకునే నీరు కూడా కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. కొందరు తెలియక అదే నీటిని వాడటంతో పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

గుంటూరు, సెప్టెంబరు 25: గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలతో పాటు గుంటూరు రూరల్ మండలం, పెదకాకాని మండల పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ జరుగుతుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సంగడిగుంట విద్యుత్ భవన్‌లోని స్కాడా మీటింగ్ హాల్‌లో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రూ.కోట్లతో ఉడాయించిన చీటీల వ్యాపారి కుటుంబం

● బాధితుల ఫిర్యాదులతో కేసు నమోదు

గుంటూరు, సెప్టెంబర్ 25 : స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్యపురికి చెందిన చీటీల వ్యాపారి కుటుంబం బోర్డు తిప్పేసింది. రాత్రికి రాత్రే పక్కా పథకం ప్రకారం కుటుంబం ఇంటికి తాళం వేసి పరారైంది. దీంతో బాధితురాలు గార్లపాటి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చైతన్యపురికి చెందిన సుబ్బారెడ్డి ,చంద్రావతి దంపతులు సుమారు ఇరవై ఏళ్లుగా స్థానికంగా తమ సొంతింటిలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో పెరిగిన పరిచయాలను ఉపయోగించుకుని గత పదిహేనేళ్లుగా చీటీ పాటలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా స్థానికంగా నమ్మకం పెంచుకుని అనేక మంది మహిళలు, ఉద్యోగస్తులు ఆమె వద్ద చీటీలు వేశారు. అయితే, తానే చీటీలు పాడుకుని ఆ డబ్బులు వారికి ఇవ్వకుండా తానే వడ్డీ ఇస్తానని చెప్పి ఆ మొత్తాన్ని తన వద్దే ఉంచుకుంది. ఈ సమయంలో చంద్రావతి కుటుంబం పథకం ప్రకారం తమ ఇంటిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత చిట్టీల సొమ్ముతో ఉడాయించినట్లు బాధితురాలు వాపోయింది. ఈ విధంగా ఒక్కొక్కరికి రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఆమె ఇవ్వాల్సి ఉంది. సుమారు రెండు కోట్లకు పైగా చీటీల సొమ్ము చంద్రావతి కుటుంబం పరారైనట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రావతి, ఆమె భర్త సుబ్బారెడ్డి, కుమారులు శ్రీహర్షరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామిరెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హజ్ యాత్రికులకు రూ. లక్ష సాయంపై హర్షం

గుంటూరు, సెప్టెంబరు 25 : మైనార్టీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన సమీక్ష సమావేశం నిర్వహించి తగిన విధంగా చర్యలు తీసుకోవడం హర్షణీయమని మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షులు ఎస్ఎం షరీఫ్ తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పథకాలు రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించడం శుభపరిణామమని షరీఫ్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో చంద్రబాబు మైనార్టీలకు సంబంధించి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రధాన హామీలపై చర్చించారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి లక్ష సహాయము, టిడిపి హయాంలో మంజూరైన హజ్ హౌస్ నిర్మాణ పనులు 80శాతం పూర్తి చేయగా మిగిలి ఉన్న 20 శాతం నిర్మాణాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. మసీదుల నిర్వహణకు ప్రతినెల 5 వేల తో పాటు ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు త్వరలోనే అమలులోకి రావాలని సూచించారని షరీఫ్ తెలిపారు.

దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25: భారతీయ సంస్కృతి వైభవం, ఏకాత్మతా మానవతావాదం అనే సూత్రంతో దేశాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ తూర్పు కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. బుధవారం బీజేపీ ఆరవ మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్ జైన్ ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నిర్వహించి నివాళు లర్పించారు. అనంతరం పార్టీలో చేరిన యువతకు అయన బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మహోన్నత వ్యక్తి పండిట్ దీనదయాళ్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25 : ఏకా త్మతా మానవతా వాదాన్ని ప్రతిపాదించి, కార్యకర్తల మనోహృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నత వ్యక్తి పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 138వ పోలింగ్ బూత్ లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు నగ రంలోని పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు.



నా దృష్టిలో... వేడుక అంటే ఇదే

నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.



నేరస్థుల పాలిట యముడు

'జై భీమ్' ఫేమ్ టీజే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలిసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి గాయకుడు బాలు పేరు




• సీఎం స్టాలిన్ ఉత్తర్వులు

గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజిత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజిత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్టుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు..

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏమిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేషు చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారలుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థీఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

దిక్సూచి
DIKSUCHI



ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. • వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.7000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.17,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.9,800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యూనాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్‌ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



8వ వార్డు సచివాలయంలో వార్డు సభను నిర్వహిస్తున్న ఏఈ చైతన్య, వేదికపై మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, ఆంజనేయుడు తదితరులు

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిద్దాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 25: పురప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిద్దామని మున్సిపల్ అధికారులతో పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక కొత్తపేటలోని 8వ వార్డు సచివాలయంలో బుధవారం స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా వార్డు సభను మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో వార్డు సభలను నిర్వహిస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను సత్వరమే అధికారుల సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. వార్డు ప్రజలు ముఖ్యంగా తమ రేషన్‌కార్డు తొలగించారని, పింఛను రావడలేదని, మురుగు కాలువలను నిర్మించాలని వంటి పలు సమస్యలను అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ చైతన్య, కూటమి నాయకులు డాక్టర్ వేమూరి శేషగిరిరావు, చాట్రగడ్డ ఆంజనేయులు, నరసింహ, కిషోర్, చిరంజీవి, సీహెచ్ రాధిక, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

6వ వార్డులో ...

స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా 6వ వార్డు సభను 6వ వార్డు సచివాలయంలో మున్సిపల్ అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మీ పాల్గొని వార్డులోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా ఏవీఆర్ ఎలిమెంట్రీ స్కూల్‌లో, కవిరాజా పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని, వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా పాడయిందని, కొత్తగా డ్రెయిన్లను నిర్మించాలని, నూతన రోడ్లను నిర్మించాలని అంగన్‌వాడీ కేంద్రం లేదని పలు సమస్యలపై అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీరనారాయణ, రామరాజు

గాయకుడు బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25: కఠోర సాధనతో శిఖరాగ్రాలకు చేరిన మధుర గాయకుడు బాలసుబ్రహ్మణ్యం పాట అజరామరమని వివేకా విద్యా సంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ చెప్పారు. వివేకా మహిళా కళాశాల ప్రాంగణంలో బుధవారం బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నటుడిగా, సంగీత దర్శకుడిగా, ప్రతి ఒక్కరి అభిమానాన్ని చూరగొన్నారని, ఎందరో యువ గాయకులకు ఉజ్వల భవిష్యత్తు అందించారని చెప్పారు. గాయకుడు నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో కె.రామరాజు తదితరులు పాల్గొన్నారు.



హఫ్‌పేటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరిస్తున్న ఏవో ప్రేమసాగర్

మోతాదుకు మించి ఎరువులతో పంటలకు నష్టం

● ఏడీఏ ఉషారాణి



సదస్సులో ప్రసంగిస్తున్న ఏడీఏ ఉషారాణి

తెనాలి రూరల్, సెప్టెంబరు 25: పంటల సాగుకు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వినియోగించడం ద్వారా పంటలకు మేలు జరగకపోగా హాని కలుగుతుందని ఏడీఏ ఉషారాణి చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాలో ఏవో ప్రేమగర్, వ్యవసాయ సిబ్బందితో కలిసి వరిపైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. పెట్టుబడి తక్కువ అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో సేవలపై రైతులకు వివరించారు. ఏవో ప్రేమసాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఈవో గడ్డంమోహన్, వీఏఏ వంశీ, నాగేంద్ర, శివతేజ, రేణుక, ప్రకృతి వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



దీనదయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు

పండిత్ దీనదయాళ్‌కు ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25: జనసంఘ్ ప్రధాన కార్యదర్శి పండిత్ దీనదయాళ్ జయంతిని రూరల్ మండలం అంగలకుదురులో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు మాట్లాడుతూ, సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన ఉన్నత స్థానానికి ఎదిగారని చెప్పారు. సంఘ విస్తరణకు చదువుకు స్వస్తి చెప్పారని, కొద్ది కాలంలోనే సంఘ్ గుర్తింపు పొందేలా కృషి చేశారని చెప్పారు. భారతీయ జనసంఘ్ అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం పని చేసిన ఆయన దేశ సేవ కోసమే జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. పార్టీ నాయకులు కె.నందకిషోర్, కామేశ్వరరావు, శ్రీనివాస్, యోగనందకిషోర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిస్టిక్ స్కేటింగ్ క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన



జెస్సీ రాజ్‌ను అభినందిస్తున్న కలెక్టర్

గుంటూరు(తూర్పు),సెప్టెంబరు 25: ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ స్కేట్ ఓషేరియా ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన మంగళగిరికి చెందిన జెస్సీ రాజ్‌ను కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, దేశ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం ముంబయికి చెందిన మహావతార్ బాబాజి తాడేకం ఫౌం డేషన్ (ఎమ్‌బీటీఎఫ్) అందించిన రూ.50 వేల చెక్కును జెస్సీ రాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ కోఆర్డినేటర్ వై.సాయి సుధ, క్రీడాకారిణీ తల్లిదండ్రులు సురేష్, రాధ, డీపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి

● మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు



పెద్దన్న చెరువు పార్కులో సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు పీకుతున్న కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 25: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అన్నారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు పెద్దన్న చెరువు పార్కులో స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమం బుధవారం జరిగింది. నిడుబ్రోలు సచివాలయ సిబ్బందితో కలిసి కమిషనర్ రమేష్‌బాబు శ్రమదానం చేసి పార్కులో పిచ్చిచెట్లు చెత్తచెదారాలు తొలగించారు. అధికారుల శ్రమదానం సంగతి తెలిసి నిడుబ్రోలువాసులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్కును శుభ్రంచేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు వ్యర్థాలను రహదారులపై కానీ, మురుగు కాల్వలో కానీ వేయవద్దని సూచించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పారిశుధ్య సమస్యలు పరిష్కరించి స్వచ్ఛ పొన్నూరును రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, గోగినేని రజిని కుమార్, పొన్నగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు

కొల్లిపరలో..

కొల్లిపర, సెప్టెంబరు 25: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కొల్లిపరలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ స్వచ్ఛత వైపు నడిపించేందుకు గ్రామ ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా మండలంలోని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత హీ కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయుడు మృత్యుంజయరావు, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు కరీమూన్, నూర్జహాన్, స్వర్ణకుమారి, సీఆర్పీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు



పొన్నూరులో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ప్రదర్శిస్తున్న మహిళలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 25: సంక్షేమ పాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ములకుదురులో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు అయిందన్నారు. కూటమి ప్రభుత్వం అనేక ప్రజా హర్ష నిర్ణయాలు తీసుకుందని వివరించారు. పెన్షన్లను రూ.1000 పెంచి ఇవ్వటమే కాకుండా గత మూడు నెలల బకాయిలను కూడా లబ్ధిదారులకు అందించి ఎన్నికల హామీని నిలుపుకున్నారన్నారు. రానున్న రోజులో ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకాన్ని అమలు చేసి మహిళలకు లబ్ధి చేకూర్చనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, సాంబశివరావు, షేక్ షఫ్రూ, జనసేన నాయకులు ఏలిషా, మధు తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

తెనాలిలో...

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని టీడీపీ నేత కొప్పురావూరి హరికిషోర్ చెప్పారు. పట్టణంలోని 7వ వార్డులో బుధవారం స్వర్ణాంధ్ర వార్డు సభను నిర్వహించారు. మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ అరాచక పాలన గుర్తించిన ప్రజల కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పెన్షన్ల పెంపు, జీతాల పంపిణీ, అన్న క్యాంటీన్ల నిర్వహణ వంటి సంక్షేమాలను చేపట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రం ముందుండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. చదలవాడ వేణు, వేమూరి శేషగిరిరావు, ఆంజనేయులు, ప్రశాంతి, చిరంజీవి పాల్గొన్నారు.

గృహాలు నిర్మించుకునేలా అధికారులు కృషి చేయాలి

● మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు

కొల్లిపర, సెప్టెంబరు 25: లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా అధికారులు తమ వంతు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణాలపై ప్రతి ఒక్క లబ్ధిదారునికి అవగాహన కలిగించాలన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్న వెంటనే నగదును బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగించు కోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఉప సర్పంచ్ నాగభూషణం, మురళి, సాయి, గిరి, వేణు తదితరులు

నాగభూషణం సేవలు అభినందనీయం

● గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి రూరల్, సెప్టెంబరు 25: సేవా కార్యక్రమాలు చేస్తున్న కనగాల నాగభూషణం అభినందనీయుడని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. బుధవారం అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకులు కనగాల నాగభూషణం పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. గణేష్‌యూత్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద వీరవల్లి, కనగాల అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను వీరవల్లి మురళి నాగభూషణంతో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెనాలిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో కనగాల నాగభూషణం, వీరవల్లి మురళిలు పాల్గొని కేక్‌కటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కనగాల నాగభూషణంను పలువురు నాయకులు, అభిమానులు ఘనంగా సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గణేష్‌యూత్ సభ్యులు, పలువురు నాయకులు, ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఆధ్వర్యంలో గృహ సామగ్రి పంపిణీ



సామగ్రి పంపిణీ చేస్తున్న విద్యార్థులు,అధ్యాపకులు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 25: స్థానిక వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో తాడేపల్లి లోని వరద బాధితులకు రూ.5 లక్షల విలువగల గృహ సామాగ్రి పంపిణీ చేశారని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పాల్గొని గృహ సామాగ్రితో కూడిన బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన తాడేపల్లి మండలంలోని నులకపేట సమీప ప్రాంతాల్లోని 500 కుటుం బాలకు గృహ సామగ్రి పంపిణీ చేశామన్నారు.



నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

రైతులకు నష్టపరిహారం అందేలా చూడండి

● తహసీల్దార్‌కు రైతుసంఘం నాయకుల వినతి

తెనాలిరూరల్, సెప్టెంబరు 25: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న నిమ్మ, అరటి పంటలకు నష్టపరిహారం అందేలా చూడాలని తహసీల్దార్ గోపాలకృష్ణను రైతుసంఘం నాయకులు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి రైతులతో కలిసి వచ్చిన రైతుసంఘం నాయకులు మండలంలో భారీ వర్షాలకు అంగలకుదురు, సంగంజాగర్లమూడి తదితర గ్రామాల్లో నిమ్మ, అరటి పంటలు దెబ్బతిన్నాయని వాటిని అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేలా రైతుల వివరాలు నమోదు చేసుకోలేదని ఆరోపించారు. పంటలు నష్టపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులకు ప్రభుత్వ సాయం కూడా అందకపోతే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతుల వివరాలు నమోదుచేసి వరి ఎకరాకు రూ.25వేలు, నిమ్మ, అరటి పంటను బట్టి రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకూ పరిహారం అందించేలా చూడాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతులు వెలగా ఆదినారాయణ, పాపోలు శ్రీనివాసరావు, ములకా శివకుమారి, కడియాల శ్రీనివాసరావు, కూచిపూడి శకుంతల. తెనాలి ఝూన్సీ, మన్యం శ్యాంబాబు, కనగాల రామకృష్ణ, తెనాలి శాతంకుమారి, నాగేశ్వరరావు, తెనాలి మేరిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ డీఎస్పీగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంటెలిజెన్స్ డీఎస్పీ సుధాకర్

గుంటూరు, సెప్టెంబరు 25: ఇంటెలిజెన్స్ డీఎస్పీగా నియమితులైన కొసన సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ ఐజీ కార్యా లయంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ బాబు ఇటీవలే డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. తాజాగా జరిగిన బదిలీల్లో గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా నియమితులయ్యారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ సతీష్ కుమార్‌ని కలిశారు.

సివిల్ సప్లయిస్ కార్మికుల కూలి రేట్లను పెంచండి

● కళ్లకు గంతలతో కార్మికుల నిరసన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25: సివిల్ సప్లయిస్ కార్మికుల కూలి రేట్లను పెంచాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ముఠా కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల కూలి రేట్ల అగ్రిమెంట్ 9 నెలలు పూర్తయినా ఇంత వరకూ పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కూలి రేట్ల పెంపుదల జీవోను విడుదల చేయాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

గుంటూరు, సెప్టెంబరు 25: గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలతో పాటు గుంటూరు రూరల్ మండలం, పెదకాకాని మండల పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం అదాలత్ జరుగుతుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సంగడిగుంట విద్యుత్ భవన్‌లోని స్కాడా మీటింగ్ హాల్‌లో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల జరుగుతుందన్నారు.

భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం

● 79.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



నిడుబ్రోలు ఎరుకులవాడలో గృహాల్లో చేరిన వర్షపు నీరు

పొన్నూరు టౌన్, చేబ్రోలు, సెప్టెంబరు 25: పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పొన్నూరులో 79.2 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. తెల్లవారుజామున రెండు గంటల పాటు ఏకదాటిగా వర్షం కురవటంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలోని నిడుబ్రోలు ఎరుకులవాడలలో పల్లపు ప్రాంతాలో ఉన్న గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. అలాగే పలు ప్రాంతాలో కురిసిన భారీ వర్షానికి రహదారుల వెంట భారీగా వర్షపు నీరునిల్చి రహదారులు కాల్వలను తలపించాయి. పొన్నూరు-చేబ్రోలు మండలంలో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలతో పొన్నూరు - చేబ్రోలు మండలాలో పెద్దఎత్తున ఖరీఫ్ వరి సాగును రైతులు నష్టపోయారు. తిరిగి రైతులు వరి నాట్లు వేసే దశలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తిరిగి పంటలకు నష్టం వాటిల్లితుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఖరీఫ్ పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



జయమ్మ (ఫైల్ ఫొటో)

చేబ్రోలు, సెప్టెంబరు 25: మహిళ అదృశ్యంపై చేబ్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం పాతరెడ్డిపాలెంకు చెందిన మద్దు జయమ్మ అనే 50 సంవత్సరాలు కలిగిన మహిళ ఈ నెల 24వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులతో జరిగిన ఘర్షణల కారణంగా జయమ్మ ఇంటినుంచి బయటకు వెళ్లినట్లు బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు బంధువుల ఫిర్యాదు మేరకు జయమ్మ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.



జీవామృతం తయారీపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

● మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసనాయక్

చేబ్రోలు, సెప్టెంబరు 25: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసనాయక్ అన్నారు. మండల పరిధిలోని సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడటం వల్ల జరిగే చెడు పరిణామాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవయసాయం వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. ద్రవ జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పంటలను కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మైల వెంకటరామరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

29నుంచి పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాలు

● మూడు రోజులు అన్ని అర్జిత సేవలు రద్దు ● ఈవో లీలా కుమార్

పెదకాకాని, సెప్టెంబరు 25: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే పవిత్రోత్సవాల సందర్భంగా దేవస్థానంలో శ్రీస్వామి, అమ్మవార్లకు జరిగే ఆర్జిత సేవలు, రాహుకేతు పూజలు, నవగ్రహ పూజలు, రుద్ర, చండీ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, శాంతి కల్యాణాలు అన్ని సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో గోగినేని లీలాకుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తిరిగి అమావాస్య సందర్భంగా 2వ తేదీ ఉదయం గం.6.00 నుంచి అన్ని ఆర్జిత సేవలు యథావిధిగా ఉంటాయని తెలిపారు. భక్తులు విషయం గ్రహించి దేవస్థాన అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవస్థానంలో వాహన పూజలు, అన్నప్రాసనలు చేసుకొను అవకాశం ఉన్నదని ఆలయ ఉప కమిషనర్ తెలిపారు.



అధ్యాపకుడిని అభినందిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

వీవీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్

పెదకాకాని, సెప్టెంబర్ 25: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పచ్చల నాగబాబు 'మాల్వేర్ అనాలసిస్‌పై చేసిన పరిశోధనలకుగాను తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. వీవీఐటీ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగబాబు కంప్యూటర్ మాల్వేర్‌లను గుర్తించి అధ్యయనం, విశ్లేషణ అనంతరం సైబర్ దాడులను ముందుగా గుర్తించేవిధంగా చేసిన పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ ఎస్.జేలక్ష్మి పర్యవేక్షణలో అందించి ఈ డాక్టరేట్ పొందినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా నాగబాబును చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరి బాబు, ఐటీ విభాగాధిపతి ఎ.కళావతి అభినందించారు.

రూ.కోట్లతో ఉడాయించిన చీటీల వ్యాపారి కుటుంబం

● బాధితుల ఫిర్యాదులతో కేసు నమోదు

గుంటూరు, సెప్టెంబర్ 25 : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య పురికి చెందిన చీటీల వ్యాపారి కుటుంబం బోర్డు తిప్పేసింది. రాత్రికి రాత్రే పక్కా పథకం ప్రకారం కుటుంబం ఇంటికి తాళం వేసి పరారైంది. దీంతో బాధితురాలు గార్ల పాటి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చైతన్యపురికి చెందిన సుబ్బారెడ్డి ,చంద్రావతి దంపతులు సుమారు ఇరవై ఏళ్లగా స్థానికంగా తమ సొంతింటిలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో పెరిగిన పరిచయాలను ఉపయోగించుకుని గత పది హేనేళ్లగా చీటీ పాటలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా స్థానికంగా నమ్మకం పెంచు కుని అనేక మంది మహిళలు, ఉద్యోగస్తులు ఆమె వద్ద చీటీలు వేశారు. అయితే, తానే చీటీలు పాడుకుని ఆ డబ్బులు వారికి ఇవ్వకుండా తానే వడ్డీ ఇస్తానని చెప్పి ఆ మొత్తాన్ని తన వద్దే ఉంచుకుంది. ఈ సమయంలో చంద్రావతి కుటుంబం పథకం ప్రకారం తమ ఇంటిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత చిట్టీల సొమ్ముతో ఉడాయించినట్లు బాధితురాలు వాపోయింది. ఈ విధంగా ఒక్కొక్కరికి రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఆమె ఇవ్వాల్సి ఉంది. సుమారు రెండు కోట్లకు పైగా చీటీల సొమ్ము చంద్రావతి కుటుంబం పరారైనట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రావతి, ఆమె భర్త సుబ్బారెడ్డి, కుమారులు శ్రీహర్షరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామిరెడ్డి పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.